

# ప్రేమ విరిసింది

—బుద్ధి యజ్ఞమూర్తి

ఒంగోలు,
మార్చి *25, 1988*

ప్రియ రోహిణి!

ఐదు రోజులనుండీ నీ ఉత్తరం కోసం నిరీక్షించి... నిరీక్షించి ఆశాభంగం చెందినవాడినై తిరిగి నేనే ఉత్తరమేస్తున్నాను.

ఎప్పటికప్పుడు 'ఈరోజు తప్పకుండా వస్తుంద'ని అనుకుంటూ రోజూ పోస్టాఫీసు చుట్టూ తిరుగుతున్నాను— పోస్ట్‌మేన్ వచ్చేవరకు ఆగలేక. కానీ ఇవేళ్టికి కూడా ఉత్తరం రాకపోయేసరికి నా మనసు నా మాట వినని మొరాయిస్తోంది. ఎంత పిచ్చిప్రేమ ఏర్పడిపోయింది ఈ పది రోజుల్లో నీ మీద.

అసలెందుకేశావు ఉత్తరం? అది వేయకపోయినట్లయితే నీ మీద నాకింత అనురాగం ఉదయించేది కాదు. ఇప్పుడింత వేదన ఉండేది కాదు. నాలో ప్రేమ రేపెట్టి మౌనంగా ఉండిపోవడం నీకు భావ్యమా?

రోహిణీ! ఎల్లుండి నుండి 'internals' మొదలవుతాయి. ఇంతవరకు 'బుక్' ముట్టుకుంటే ఒట్టు. ఎప్పుడూ నీ ధ్యాసే. ఇంకేం చదువుతాను? ఎంతగానో ప్రయత్నిస్తున్నాను చదవాలని. కుదరందే! ఏం చేయను చెప్పు. ఈ ఇంటర్నల్స్‌ని నిర్లక్ష్యం చేయడానికి వీలవదు. ఈ టెస్ట్‌ల్లో వచ్చిన మార్కులు 20 శాతం ఫైనల్ ఎగ్జామ్స్‌లో కలుస్తాయి. మార్కులు తక్కువ వస్తే మళ్ళీ ఆ ఓటమిని కూడా భరించలేను. అన్నిట్లోనూ నేను ఫస్ట్ ఉండాలని మొదట్నుండీ కష్టపడ్తూనే ఉన్నాను. కానీ ఏక్సిడెంటల్‌గా నాలో ఇంత సంచలనం కలిగించావు తప్పుకాదు కానీ— ఇదే నా బలహీనతయ్యేట్లుంది.

తొలిసారి నా జీవితంలో ఓ అందమైన అమ్మాయి 'నిన్ను ప్రేమిస్తున్నా'నంటూ ఉత్తరం వేస్తే నాకది గొప్ప ఎక్సైట్‌మెంట్ అన్పించింది. ఆ 'ప్రేమ సందేశం' నాలో గొప్ప అనుభూతిని రేకెత్తించింది. తక్షణమే నీ ముందు వాలాలన్పించింది. కానీ రాలేను. ఒక్కసారిగా నిన్ను చూస్తే నా కల చెదిరిపోతుందేమో ననే సందేహం. నీ చెంత నేను సరిగ్గా వ్యవహరించగలనా? అని భయం. హృదయంలో బ్రేవ్‌నెస్ రానీ— కొంత కాలం ఈ భావోద్వేగాన్ని అనుభవించనీ— అప్పుడొస్తాను. అప్పటి వరకు నాకు ఉత్తరాలు వేస్తుండు ప్లీజ్!

రోహిణీ! నా ఉత్తరం నీ కందేలోగా ని నుండి ఉత్తరం వస్తుందేమోననిపిస్తోంది. మొన్న నాకో ఉత్తరమొస్తే నీ నుండేమోనని ఎంత సంబరం కలిగిందో? చూస్తే— అది నా స్నేహితుడు శంకరం గాడి నుండి. నిరాశ పడిపోయాను.

ఇప్పుడే నాలో ఓ అనుమానం మొదలయ్యింది. అసలు నా ఉత్తరం నీకు అందిందా— లేదా— అని. మళ్ళీ ఏమూలో చేరే ఉంటుందనే ఆశ...

నీ తొలి ఉత్తరంలోని విషయాలు ఇంకా నన్ను సంభ్రమాశ్చర్యాలలో ముంచివేస్తూనే ఉన్నాయి. నామీద నీకింత లవ్ ఏర్పడటానికి మనమధ్య ఎటువంటి సన్నివేశం కూడా తటస్థించలేదు కదా— మరెలా సంభవం ఇది? జవాబు చెప్పవూ?! నన్ను... నన్ను పిచ్చివాడ్ని చేయడానికి ఆ ఉత్తరమేయలేదు కదూ! అదే నిజమైతే నేను జీవించి ఉండను. అంత వెర్రివాడినై పోతున్నాను— నీ మీద ప్రేమతో.

రోహిణీ! ఈ మధ్య మనీ ఎక్కువగా ఖర్చుపెట్టేస్తున్నాను నేనెంత పంపమంటే అంత పంపిస్తున్నారు నాన్న. అనవసరమైన ఖర్చులెన్నో చేస్తున్నాను. సినిమాలు ఓవర్ అయిపోయాయి— చూడటం. తగ్గించుకోవాలంటే సాధ్యపడటం లేదు. అందుకని నీమీదే ఒట్టేశాను— ఈ చదువు అయ్యేవరకు ఇక సినిమా చూడకూడదని. ఇప్పుడు ధైర్యం వొచ్చింది. ఎందుకంటే నీ మీద ఒట్టేసి ఇక ఆపని చేయనంటే చేయను— చేయలేను.

ఇంకా ఏమి రాయాలో మైండ్‌కి తోటడం లేదు. ఇంకా ఏవేవో పిచ్చి, పిచ్చి ఆలోచనలు మెదుల్తున్నాయి కానీ అవి రాస్తే నీవు చదివి నవ్వుకుంటావేమోనని అవి రాయట్లేదు. నీవు మాత్రం ఇది అందిన తర్వాతన్నా ఉత్తరం రాస్తే దాన్నందుకొని తనివితీరా తృప్తి చెంది తిరిగి చదువుని యథాప్రకారం కొనసాగించవచ్చుననే ఆశతో వేస్తున్నానీ ఉత్తరం. నాకు పిచ్చెక్కకముందే వేస్తావు... కాదు— పంపిస్తావు కదూ నీ'ప్రేమ సందేశా'న్ని. ఉంటా—

నీ
చైతన్య